

పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలి: ఎమ్మెల్యే

చిక్కడపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని, పనులను త్వరగా పూర్తి చేయాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్ చౌరస్తాలో జరుగుతున్న సీవరేజ్ పైప్‌లైన్ పనులను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. నెల రోజులైనా పనులు పూర్తికాకపోవడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల నిర్వహణలో ఆలస్యం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. పనుల వల్ల వాహనచోదకులకు, పాదచారులకు ఇబ్బందులు రాకుండా ట్రాఫిక్ హోమ్‌గార్డ్‌ను ఏర్పాటు చేయాలని ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ముదారపు రాకేష్‌కుమార్, నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, నరేశ్, ఎర్రం శ్రీనివాస్ గుప్త, పున్న సత్యనారాయణ, వెంకటేశ్, ఆకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు

రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా మారిన మ్యాన్‌హోల్‌కు జలమండలి సిబ్బంది మరమ్మతు చేశారు. గాంధీనగర్ డివిజన్ సురభి పార్కువద్ద రోడ్డు మధ్యలో మ్యాన్‌హోల్ కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. ఎమ్మెల్యే ముఠాగోపాల్ ఆదేశాల మేరకు జలమండలి అశోక్‌నగర్ సెక్షన్ మేనేజర్ కృష్ణమోహన్ పనులు నిర్వహించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సాధినేని వెంకటేశ్వరరావు తదితరులు

'ఐక్యత చర్చలు త్వరలోనే ముగుస్తాయి'

● న్యూడెమోక్రసీ నాయకులు వెల్లడి

నల్లకుంట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): విప్లవకారుల ఐక్యతే లక్ష్యంగా సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ (చంద్ర పుల్లారెడ్డి) పార్టీలు ఐక్యమవుతున్నాయని పలువురు నాయకులు పునరుద్ఘాటించారు. ఇప్పటికే ప్రారంభమైన ఐక్యతా చర్చలు త్వరలోనే ముగుస్తాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. శనివారం విద్యానగర్ మార్క్స్ భవన్‌లో విప్లవోద్యమ సారథి చంద్ర పుల్లారెడ్డి 40వ వర్ధంతి కార్యక్రమం ఐఎఫ్‌టీయూ నగర అధ్యక్షురాలు అరుణ, అనురాధల అధ్యక్షతన జరిగింది. సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నేతలు పి.సూర్యం, సాధినేని వెంకటేశ్వరరావు, జేవీ చలపతిరావు, కె.గోవర్దన్ ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. పార్టీ సిద్ధాంతకర్త, నిర్మాత చంద్ర పుల్లారెడ్డి పోరాట స్ఫూర్తితో గోదావరి లోయ గిరిజన రైతాంగ ప్రతిఘటన పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లారని కొనియాడారు. నేడు విప్లవోద్యమం అనేక సవాళ్లను ఎదుర్కొంటూ వర్గ పోరాటాలను తీవ్రతరం చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ నాయకురాలు ఝాన్సీ, అనసూయ, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.మహేష్, పి.నాగరాజు, నా యకులు నవీన్, యశ్వంత్, శ్యామ్, మల్లికార్జున్, మణిమాల, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును పెద్ద ఎత్తున చేయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

బర్కత్‌పుర, నవంబరు 9 (ఆంధ్ర జ్యోతి): కాచిగూడ డివిజన్‌లో బీజేపీ మహిళామోర్చా సభ్యత్వ నమోదును పెద్ద ఎత్తున చేయించాలని స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమాదేవి కోరారు. శనివా రం నింబోలిఅడ్డలోని డివి జన్ అభివృద్ధి కార్యాలయంలో మహిళా మోర్చా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సభ్యత్వ న మోదులో కాచిగూడ డివిజన్‌ను నగరంలోనే ఆదర్శంగా నిలపాలని కోరారు. మహిళలు, యువతులు పార్టీలో చేరడానికి ఆసక్తి చూపుతున్నారని అన్నారు. కార్యక్రమంలో మహిళా మోర్చా నాయకురాళ్లు బి.జ్యోతి, లావణ్య, కీర్తి, శాంతా బాయి, సారిక, వరలక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

బాలోత్సవం ఆడియో, వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

రాంనగర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, రచన, సంగీత దర్శకుడు యశోకృష్ణ స్వరపరచిన తెలంగాణ బాలోత్సవానికి సంబంధించిన మాస్ సాంగ్ ఈ నెల 18వ తేదీన విడుదల కానున్నదని బాలోత్సవం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం బాగ్‌లింగంపల్లిలో ఈ పాటకు సంబంధించిన ఆడియో, వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ పాటను సుద్దాల అశోక్‌తేజ, భారత్ విద్యా సంస్థల అధినేత ఎస్.వేణుగోపాల్‌రెడ్డి ఆవిష్కరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో బాలోత్సవం కార్యదర్శి సోమయ్య, ఉపాధ్యక్షురాలు సుజావతి, నృత్య గురువులు రమణిసిద్ధి, ఇందిరా పరాశరం, లలిత తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పైప్‌లైన్ పనులను సత్వరం పూర్తి చేయాలి

నల్లకుంట, నవం బరు 9 (ఆంధ్రజ్యోతి) : బాగ్‌అంబర్‌పేట డివిజన్ ప్రభుత్వ ఆస్పత్రి ఎదురు వీధిలో చేపట్టిన నూతన డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను సత్వరం పూర్తి చేయాలని స్థానిక కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి జలమండలి అధికారులకు సూచించారు. ఆ పనులను ఆమె శనివారం జలమండలి ఏఈ మహమ్మద్ మజీద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణలతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణం వల్ల ఆ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు త్వరగా పనులను పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మిరియాల శ్రీనివాస్, మహేష్, బాలాజీ పాల్గొన్నారు.



విజయకుమార్‌కు నియామకపుపత్రం అందజేస్తున్న పుట్టియాదగిరి, ఠాకూర్ యమన్‌సింగ్

'హిందూ ఆలయ పరిరక్షణ సమితి' అధ్యక్షుడిగా విజయకుమార్

గోల్నాక, నవంబర్ 9 (ఆంధ్రజ్యోతి): సనాతన హిందూ దేవాలయ పరిరక్షణ సమితి అంబర్‌పేట నియోజకవర్గం అధ్యక్షునిగా విజయకుమార్ నియమితుల య్యారు. గోల్నాక డివిజన్ తిరుమలనగర్ లోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద జరిగిన కార్యక్రమంలో సనాతన హిందూ దేవాలయ పరిరక్షణ సమితి రాష్ట్ర ఛైర్మన్ పుట్టి యాదగిరి, అధ్యక్షులు ఠాకూర్ యమన్‌సింగ్‌లు విజయకుమార్ నియామకాన్ని ప్రకటించి ఆయనకు నియామకపు పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్ బాబూరావు, పరమేష్, జె.కె.రాముడు, డిఅంజయ్య, కృష్ణా గౌడ్, గౌతమ్‌రావు, దశరథ్, గోపాల్‌రెడ్డి, నరసింహారెడ్డి, తూర్పు రాంచందర్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి, నవం బరు 9 (ఆంధ్ర జ్యోతి): అభివృద్ధి పనులను త్వర గా పూర్తిచేసి ప్రజలకు వినియోగంలోకి తేవాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ. పావని వినయ్‌కుమార్ అధికారులకు తెలిపారు. డివిజన్‌లోని వాల్మీకినగర్ బస్తీలో 3.50 లక్షల వ్యయంతో చేపడుతున్న సీవరేజ్ పైప్‌లైన్ పనులను పరిశీలించారు. బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, నాయకులు శ్రీకాంత్, మహమూద్, నర్సింహ, వాటర్‌వర్క్స్ వర్క్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్ పాల్గొన్నారు.

తనకాళ్లపై తాను నిలబడే ధైర్యాన్నిచ్చేదే చదువు

భారత్‌స్కౌట్స్ అండ్ గైడ్స్ 75వ ఆవిర్భావ వేడుకల్లో ఎంపీ ఈటల రాజేందర్



జెండాను ఆవిష్కరించి వందనం చేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్ తదితరులు

కవాడిగూడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): చదువంటే కేవలం మార్కులే కాదని, సంస్కారాన్ని, సభ్యతను, మానవసంబంధాలను, సమాజంలో తనకాళ్లపై తాను నిలబడే ధైర్యాన్నిస్తుందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కార్పొరేట్ వ్యవస్థ వచ్చిన తరువాత ఇవన్నీ కనుమరుగైపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ 75వ ఆవిర్భావ వేడుకలు దోమలగూడ గగన్‌మహల్‌లోని రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలకు ఎంపీ ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరై జెండాను ఆవిష్కరించి విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో సేవలు అందిస్తున్న వారికి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేసి అభినందించారు. 75 సంవత్సరాలుగా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలపై రూపొందించిన పుస్తకాన్ని ఈటల ఆవిష్కరించారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర కార్యదర్శి అరుణ్‌కుమార్, కోశాధికారి రాజ్‌గోపాల్, స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ పరమేశ్వర్ మాట్లాడుతూ ఈనెల 10, 11 తేదీలలో మినీ స్టేట్ ర్యాలీతో పాటు వివిధ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఈ ఉత్సవాల్లో 10వ తేదీన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, స్టేట్ చీఫ్ కమిషనర్ బుర్రా వెంకటేశం, గవర్నర్ జాయింట్ సెక్రటరీ భవానీశంకర్, 11వ తేదీన ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ముఠాగోపాల్, కేపీ వివేకానంద్ గౌడ్, కార్పొరేటర్ రచనశ్రీ పాల్గొంటారని వారు తెలిపారు. ఈ సమావేశంలో జాన్ సామెల్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలకు నిధులు కేటాయించాలి: టీడీపీ

చిక్కడపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన భాండాగారాలుగా పేరుపొందిన గ్రంథాలయ వారోత్సవాల నిర్వహణకు నిధులు కేటాయించాలని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రచార కార్యదర్శి జంగం దశరథ్ తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో సుమారుగా 1800 గ్రంథాలయాలు ఉన్నాయని. ఒక్కో గ్రంథాలయానికి 25 వేల రూపాయల చొప్పున నిధులు విడుదల చేసి ఉత్సవాలు నిర్వహించాలని ఆయన కోరారు.

యాదగిరిగుట్ట పేరు కొనసాగింపు హర్షణీయం

●పులిగారి గోవర్దన్‌రెడ్డి

కవాడిగూడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి పేరును యాదగిరి గుట్టగా మారుస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించాన్ని స్వాగతిస్తున్నామని తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్దన్‌రెడ్డి అన్నారు. శనివాం ఆయన కవాడిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి యాదగిరిగుట్ట అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. యాదగిరిగుట్ట అనే పేరుతో తరతరాల అనుబంధం ఉందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొ. బాలకృష్ణారెడ్డి తదితరులు

విలువలతో కూడిన విద్యను బోధించాలి

●రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ డా. బాలకృష్ణారెడ్డి

చిక్కడపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): న్యాయ విద్య, న్యాయవృత్తి చాలా ఉన్నతమైనవని, విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను బోధించాలని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ. డా. వి. బాలకృష్ణారెడ్డి అన్నారు. చిక్కడపల్లిలోని పెండేకంటి న్యాయ కళాశాలలో రెండు రోజుల జాతీయస్థాయి మూట్‌కోర్ట్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ, కరోనా తర్వాత సమాజ స్థితిగతులలో జరిగిన పరివర్తన, సాంకేతిక నైపుణ్యం వలన జరిగిన మార్పులవల్ల న్యాయవృత్తి, న్యాయవిద్యలో పరివర్తన వచ్చిందన్నారు. న్యాయ విద్య అంతర్జాతీయస్థాయిలో వృద్ధి చెందిందని, సాంకేతిక అభివృద్ధి వలన న్యాయవృత్తి, న్యాయవిద్య అభ్యాసం సులభమైందని అన్నారు. ఉస్మానియా విశ్వ విద్యాలయం న్యాయవిభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ డా.ఎన్.రామ్‌ప్రసాద్, ఉస్మానియా విశ్వవిద్యాలయం సీనియర్ ప్రొఫెసర్, పాలమూరు విశ్వవిద్యాలయం డీన్ డా. ఎన్ . వెంకటేశ్వర్లు, వాసవి విద్యాసంస్థల అధిపతి పి. రామమోహన్‌రావు, వాసవి సంస్థల కోశాధికారి పార్థసారథి, కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి, సంయుక్త కార్యదర్శి ఎం.ఆనంద్, పెండేకంటి న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ డా.పి. అరవింద, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పి.సాయిబాబా

'కులగణన'తో తప్పుదోవ పట్టించే ప్రయత్నం

● టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు సాయిబాబా

రాంనగర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీలకు రిజర్వేషన్‌లు కల్పిస్తామని చెప్పి గతంలో టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు చెప్పిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు కులగణన పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా ఆరోపించారు. కులగణనకు ఆస్తులతో సంబంధం ఏమిటని ఆయన ప్రశ్నించారు. శనివారం దోమలగూడలోని పార్టీ నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కులగణన పేరుతో ప్రజల ఆర్థిక స్థితిగతులు తెలుసుకునే అవసరం లేదన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభు త్వం కూడా సమగ్ర సర్వే నిర్వహించి ప్రజలను దోచుకుందని విమర్శించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి భయంతోనే ఆర్భాటం చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శులు పలుస బాల్‌రాజ్‌గౌడ్, నల్లెల కిషోర్, నాయకులు ఎస్.ప్రకాష్, బి. రాజు పాల్గొన్నారు.



బర్కత్‌పురలో పృథ్వీ హెల్త్‌కేర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

ఆయుష్మాన్ భారత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

బర్కత్‌పుర, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ఆరోగ్యానికి మోదీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన ఆయుష్మాన్ భారత్‌ను పేదలు, వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. శనివారం బర్కత్‌పురలో పృథ్వీ స్కాన్ హెల్త్ సెంటర్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 70 ఏళ్లు నిండిన వృద్ధులు ఆయుష్మాన్ భారత్ ద్వారా ఉచిత వైద్య సేవలు పొందవచ్చని అన్నారు. పేదలకు ఆధునిక వైద్యాన్ని అందించేందుకు ఈ పథకం తీసుకొచ్చారని, ఒక్కొక్క కుటుంబం రూ. 5 లక్షల వరకు వైద్య సేవలు పొందేందుకు ఆయుష్మాన్ భారత్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఆరోగ్య సంరక్షణకు ప్రజలు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, పృథ్వీ స్కాన్ హెల్త్ సెంటర్ నిర్వాహకురాలు డాక్టర్ జి.పృథ్వీరాణి, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధురాలి మృతి

బర్కత్‌పుర, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందింది. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో 60 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని మహిళ బుద్వేల్ - ఉందానగర్ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



కులగణన స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న కుమారస్వామి తదితరులు

జాతీయ స్థాయిలో కులగణన చేపట్టాలి

●డి. కుమారస్వామి

బర్కత్‌పుర, నవం బర్ 9 (ఆంధ్ర జ్యోతి) : త్వరలో కేంద్ర ప్రభు త్వం చేపట్టనున్న జనగణనలో కులగణన చేపట్టాలని జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశారు. ఎన్డీయే ప్రభుత్వం ఇప్పటికైనా బీసీ వ్యతిరేక వైఖరి మానుకుని జాతీయ స్థాయిలో కులగణన చేపట్టేందుకు ఆదేశాలు జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శనివారం కాచిగూడలో సమగ్ర కులగణనపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కులగణన స్టిక్కర్లను ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణలో నిర్వహించే కుల గణన దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. కుల గణన వల్ల అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని, సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో పలువురు బీసీ దళ్ నేతలు పాల్గొన్నారు.

నిందితులను అరెస్టు చేయడంలో నిర్లక్ష్యం తగదు

● డాక్టర్ అభయ కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలి

● తెలంగాణ ప్రజా సంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ డిమాండ్



ఇందిరాపార్కు వద్ద మహిళా సంఘాల ధర్నాలో పాల్గొని మాట్లాడుతున్న వి.సంధ్య తదితరులు

కవాడిగూడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ అభయపై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రజా సంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద శనివారం పెద్ద ఎత్తున ధర్నా, ఆందోళన నిర్వహించారు. ఈ ఘటన జరిగి తొంబై రోజులైనా ఇప్పటివరకు నిందితులను అరెస్ట్ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవరించడం దుర్మార్గమన్నారు. కోల్‌కతా ఆర్‌జి కార్ ప్రిన్సిపాల్‌ను అరెస్ట్ చేసినప్పటికీ ఎఫ్ఐఆర్‌లో ప్రిన్సిపాల్ సందీప్ గోష్ పేరును నమోదు చేయకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోందని అన్నారు. వెంటనే జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించేంతవరకు మహిళా సంఘాల పోరాటం ఆగదని వారు హెచ్చరించారు. ధర్నాలో ఐద్వా రాష్ట్ర ప్రధానకార్యదర్శి మల్లు లక్ష్మి, పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు జి.అనసూయ, పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి. సంధ్య నేతలు స్వరూప, చైతన్య మహిళా సంఘం నాయకులు శ్రీదేవి తదితరులు పాల్గొని మాట్లాడారు. ఆర్‌జి కార్ జూనియర్ డాక్టర్ అభయ హత్యపై సీబీఐ విచారణను వెంటనే చేపట్టి దోషులను నిర్ధారించాలని వారు డి మాండ్ చేశారు. సాక్ష్యాలను రూపుమాపడం లో నిందితులను కాపాడటంలో ప్రభుత్వాలు ఏకపక్షంగా వ్యవహరించడం పట్ల ఆందోళన చేస్తున్న డాక్టర్లపై పశ్చిమ్‌బెంగాల్ ప్రభుత్వం , పోలీసులు పరస్పరం సహకరించుకొని కేసును తప్పుదారి పట్టించేందుకు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. దేశ వ్యాప్తంగా మహిళలపై అత్యాచారాలు, హింసను అరికట్టడానికి ప్రభుత్వాలు కఠినచర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆమనగంటి వెంకటేష్, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షులు ప్రదీప్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పందిరి మహేష్, నేతలు నాగరాజు, రామకృష్ణ, అశోక్ రెడ్డి, అనురాధ, అరుణ, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు స్పందన అంతంత మాత్రమే..



ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొన్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

రాంనగర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్, అంబర్‌పేట నియో జకవర్గాలలో ఓటర్ల నమోదుకు నామమాత్రపు స్పందన నెలకొంది. శని, ఆదివారం.. రెండు రోజుల పాటు ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించాలన్న ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ రెండు నియోజకవర్గాల్లోని పోలింగ్ బూత్‌ల వద్ద డీఎంసీలు శనివారం ఓటరు నమోదుకు శ్రీకారం చుట్టారు. అయితే రెండు నియోజకవర్గాల్లో ప్రజల నుంచి ఆశించిన స్పందన లేకపోవడంతో జీహెచ్‌ఎంసీ సిబ్బంది ఖాళీగా కూర్చోవడం కనిపించింది. 18 ఏళ్ల వయసు నిండిన వారికి కొత్త ఓటరుగా నమోదుకు, పాత ఓటర్లకు చిరునామా మార్పుకు అవకాశం కల్పించారు. అయితే ఒక్కొక్క సెంటర్ నుంచి 5 నుంచి 10 మాత్రమే దరఖాస్తులు వచ్చినట్లు సిబ్బంది తెలిపారు. ఆదివారం కూడా ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

మట్టి, చెత్త కుప్పలను ఎప్పటికప్పుడు తొలగించాలి

రాంనగర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాంనగర్ డివిజన్‌లోని రోడ్లపై పేరుకుపోయిన మట్టి, చెత్త కుప్పలను ఎప్పటికప్పుడు తొలగించాలని స్థానిక కార్పొరేటర్ కె.రవిచారి జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు. శనివారం డివిజన్‌లోని బాగ్‌లింగంపల్లి సోప్ ఫ్యాక్టరీ వీధి, బృందావనం కాలనీ, ఆజామాబాద్, చిక్కడపల్లి తదితర ప్రాంతాలలో ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్లపై పేరుకుపోయిన మట్టి, చెత్తకుప్పలను జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బందిచే తరలింపజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సతీష్, ఉపేందర్, ఉమామహేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పార్శిగుట్టలో మట్టికుప్పల తొలగింపు

ముషీరాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్ పార్శిగుట్ట ప్రధాన రోడ్డు, గంగపుత్ర సంఘం శ్మశానవాటిక వద్ద పేరుకుపోయిన మట్టికుప్పలు, చెత్తను జీహెచ్‌ఎంసీ సిబ్బంది శనివారం తొలగించారు. జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులకు డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి ఫిర్యాదు చేయడంతో ఏఎంఓహెచ్ డాక్టర్ ప్రవీణ ఆదేశాలతో సిబ్బందిని మట్టిని తొలగించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్, భాస్కర్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, నీల వెంకటేష్ తదితరులు

బీసీ విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలి

రాంనగర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని వివిధ కాలేజీల్లో చదువుతున్న బీసీ విద్యార్థులకు గత మూడేళ్లుగా చెల్లించాల్సి ఫీజు బకాయిలు రూ. 4 వేల కోట్లను తక్షణమే చెల్లించాలని మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఫీజులు, స్కాలర్‌షిప్‌లు చెల్లించకపోవడం పట్ల ప్రభుత్వంపై ఆయన ధ్వజమెత్తారు. శనివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ అధ్యక్షతన విద్యార్థుల సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ, కాంట్రాక్టర్లకు బిల్లులు పాస్ చేస్తున్న ప్రభుత్వం విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజులు ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. స్కాలర్‌షిప్‌లు. ఫీజుల బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు చాలా ఇబ్బందులకు గురవు తున్నారని, కాలేజీ యాజమాన్యాలు కోర్సు పూర్తయిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రెండు దశలలో బడ్జెట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాలేజీ కోర్సులు చదువుతున్న విద్యా ర్థులకు స్కాలర్‌షిప్ సంవత్సరానికి 5,500 చెల్లిస్తే అవి ఎక్కడ సరిపోతాయని ప్రశ్నించారు. పక్క రాష్ట్రం ఏపీలో రూ. 20 వేలు, కర్ణాటకలో రూ. 15 వేలు స్కాలర్‌షిప్ ఇస్తున్నారని, అదే విధంగా మన రాష్ట్రంలో కూడా ఇవ్వాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేష్, బీసీ సంఘం నాయకులు రాందేవ్; నంద గోపాల్, గొరిగె మల్లేష్; రాజేందర్, విద్యార్థి సంఘం నాయకులు ఉదయ్, రఘుపతి, ప్రభాకర్‌రెడ్డి, భాష, మణికంఠ పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

నల్లకుంట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం, హైదరాబాద్ జిందాబాద్, నైబర్ హుడ్ వెల్ఫేర్ కాలనీ కమ్యూనిటీ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఆదివారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బాగ్‌లింగంపల్లి సుందరయ్యవిజ్ఞాన కేంద్రం వెనుక ఎల్ఐజీ క్వార్టర్స్ కమ్యూనిటీ హాల్ లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే ఈ శిబిరంలో ప్రముఖ వైద్యులు కంటి, చెవి, ముక్కు, బీపీ. షుగర్, గొంతు, జనరల్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు.

భోలక్‌పూర్‌లో ...

ముషీరాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్‌లో ఆదివారం హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎస్ఆర్‌డి సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. వైద్య శిబిరంలో ఆర్థోపెడిక్, గైనకాలజిస్ట్, జనరల్ మెడిసిన్, పిల్లల వైద్యులు సేవలు అందిస్తారని, ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల శిబిరం కొనసాగుతుందన్నారు.

గుర్తు తెలియని యువకుడి మృతదేహం స్వాధీనం



గుర్తుతెలియని యువకుడి మృతదేహం

కవాడిగూడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని గాంధీనగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ రాజు కథనం ప్రకారం... పీఎస్ పరిధిలోని గాంధీ ఆసుపత్రి ఎదురుగా సర్వోత్తమ్ హోటల్ సమీపంలో ఓ గుర్తు తెలియని యువకుడి మృతదేహం పడి ఉందని డయల్ 100కు సమాచారం రావడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించినట్లు సీఐ తెలిపారు. మృతుడి వయస్సు 20 నుంచి 25 సంవత్సరాలు ఉంటుందని, అనారోగ్యంతో చనిపోయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌లో లేదా ఫోన్ నెంబర్ 8712660140కు సమాచారం అందించాలని సీఐ రాజు కోరారు.

బోయిగూడలో వ్యక్తి అదృశ్యం



అదృశ్యమైన మందుల శ్రీను

కవాడిగూడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో వారికి చెప్పకుండా ఓ వ్యక్తి ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం... ఠాణా పరిధిలోని బోయిగూడలో నివాసం ఉంటున్న మందుల శ్రీను (50) ప్రైవేట్ ఉద్యోగి. ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు స్థానికంగా గాలించడంతో పాటు బంధు, మిత్రులను వాకబు చేసినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం సాయంత్రం కుటుంబసభ్యులు గాంధీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మందుల శ్రీను ఆచూకీ ఎవరికైనా తెలిస్తే గాంధీనగర్ పోలీసుస్టేషన్‌లో సమాచారం అందించాలని సీఐ కోరారు.

